ఇద్దరి మధ్య వారధిలా అల్లరి చేస్తూ భోజనం చేస్తున్న నానీ "అలా ఉన్నావేం ఆంటీ" అంటూ హఠాత్తుగా అడిగే సరికి ఏం జవాబు చెప్పాలో ఆమెకు పాలు పోలేదు.

"అన్నం తినేటప్పుడు అతి తక్కువగా మాట్లాడటం ఆంటీకి అలవాటు నానీ" అంటూ సమర్ధించబోయాడు కిరీటి.

"ఉత్తుత్తికే.... మరి ప్రతిసారీ అన్నం తినేటప్పుడు ఆంటీ నాతో ఎక్కువగా మాట్లాడుతూ వుంటుందిగా"

నానీ నిలదీసే సరికి యీసారి కిరీటి ఖంగుతిన్నాడు.

"నాటీ బోయ్!"

మెచ్చుకోలుగా నానీని చూస్తూ త్వరత్వరగా భోంచేసి అక్కడినుండి జారుకున్నాడు.

ఆ రాత్రి నానీని తన దగ్గర పడుకొమ్మని కిరీటి అహ్వానించినపుడు "నో అంకుల్.... నేను ఆంటీ దగ్గర పడుకుంటాను" అని తిరస్కరించగానే శిల్ప మనసు సంబర పడిపోయింది.

రోజులు గడుస్తున్న కొద్దీ శిల్పకు అతి చేరువైపోయాడు నానీ....

ఆమెలోని నిర్లిప్తతనీ, స్థబ్దతనీ మాయంచేసే సాధనమై పోయాడు.

నానీ మెలుకువగా వున్నంతసేపూ దూరమైన ఒంటరి తనం నానీ నిద్రపోగానే ఆమెను చుట్టుముట్టేది.

ఏమిటి... తన బ్రతుకు...

తన ప్రయాణానికి గమ్యమెక్కడ?

తనది కాని జీవితంతో తను రాజీపడాలని ప్రయత్నిస్తోందా...కాని వాడు కిరీటికి భార్యగా కాకుండానే పసిపిల్లాడికి తల్లిగా మారిపోవటంలో అర్ధమేమిటి?

ఎవరికైనా తన బాధ చెప్పుకోవాలనిపించింది.

చెప్పుకుని బావురుమంటూ ఏడవాలనిపించింది.

కానీ తనుండే బంగారు పంజరంలో తనను ఓదార్చే వ్యక్తి ఎవరున్నారని...

హఠాత్తుగా ఆమెకు సునీత గుర్తుకొచ్చింది.

## 12

చికాగోలో జరిగిన ఇంటర్నేషనల్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో మాలిని మెషిన్ టూల్స్ ప్రదర్శించిన స్పెషల్ పర్పస్ మెషిన్‌కు మంచి గుర్తింపు లభించింది.

దానితో గల్ఫ్‌కంట్రీస్ నుండి విపరీతంగా ఆర్డర్స్ వచ్చిపడ్డాయి.

దేశంలో రెండు మూడు ప్రభుత్వ యంత్ర కర్మాగారాలు ఉన్నా ఎవరికీ రాని అవకాశం తన పార్టీకి అభించడంతో పెద్ద సందిగ్ధంలో పడ్డాడు.

ఉన్నవనరుల దృష్ట్యా వచ్చిన ఆర్డర్సన్నీ అంగీకరించలేడు.

సరఫరా చేస్తానని మాటిచ్చి సకాలంలో పూర్తిచేయలేక పరాజితుడిలా తలవంచటం

అందుకే కొన్ని ఆర్డర్స్‌నే టేకప్ చేయాలని సంకల్పించుకున్నాడు.

పరిమితంగా వున్న అవకాశాల మూలంగా ఇతరత్రా మరికొన్ని ఇబ్బందుల మూలంగా ఆర్డరును అంగీకరించలేక పోతున్నానని కొన్ని సంస్థలకు రిగ్రెట్ లెటర్స్ ప్రిపేర్ చేస్తుండగా కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలశాఖ సెక్రెట్రీనుండి ఫోనొచ్చింది.

అభినందనలయ్యాక మెషిన్ టూల్స్ గురించి విదేశాల నుండి వచ్చిన ఆర్డర్స్ విషయం ప్రస్తావనకు వచ్చింది.

కిరీటి ఏ పరిస్థితులలో తను అన్ని అవకాశాలను వినియోగించుకోలేక పోతున్నాడో వివరించగానే సెక్రట్రీ ససేమిరా వీలుకాదన్నాడు.

ఎంతో విదేశమారకానికి అవకాశం వున్న ఈ ఆర్డర్స్ వదులుకోవటం కంటే ఇతర భారీయంత్రం కర్మాగారాలకి "ఆఫ్‌లోడ్" చేసి అవసరమైతే తను సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటం సముచితంగా వుందంటున్నాడు. లేదా ఫాక్టరీ ఎక్స్‌పెన్షన్ ప్రోగ్రామ్‌ను సత్వరం అమలుజరిపి అంతా తను పూర్తి చేయటమే సవ్యమని స్పష్టం చేశాడు.

ఆలోచనలో పడ్డాడు కిరీటి .....

పరిశ్రమలశాఖ జోక్యంతో తను అవసరమైన ఋణాన్ని పొందటం ఫాక్టరీని ఎక్స్‌పేండ్ చేయటం కష్టమైన పనికాదు-- కాని వ్యవధి చాలదు.

అందుకే "ఐ విల్ లుక్ ఇన్ టు ది మేటర్" అని చెప్పి ఫోన్ పెట్టేశారు.

బాగా అలోచించాక ఒక నిర్ణయానికి వచ్చాడు.

కార్మికుల్ని యధారీతిని ప్రోత్సహించి ఉత్పత్తిని తద్వారా ఉత్పాదాక శక్తిని పెంపొందింప చేయాలి.

మూడవ వంతు ఆర్డర్సు తనే పూర్తి చేసి మిగతా ఒక భాగం మరో యంత్ర కర్మాగారానికి ఆఫ్‌లోడ్ చేయాలి.

అవసరమైతే ఆ యంత్రాలకు కావలసిన కేస్టింగ్స్ (పోత ఇనుముతో తయారు చేయబడిన యంత్ర భాగాలు) తమ ఫౌండ్రీలోనే ఉత్పత్తిచేసి మెషినింగ్, ఎసెంబ్లీ మాత్రం బయట కర్మాగారానికి వదిలిపెట్టాలి.

మరుసటిరోజే ఢిల్లీకి ట్రంకాల్ చేసి "గ్రోత్ ఆఫ్ ఎనీ ఇండస్ట్రీ" అన్న నిజం తెలిసిన కిరీటి తన పథకంలోని మొదటి భాగంగా ఆ ఏడాది ఇరవై శాతం బోనస్ ప్రకటించాడు.

అంతకు ముందు ప్రమాదంలో మరణించిన అయిదుగురి కార్మికుల కుటుంబాలకు అయిదేసి వేల నష్టపరిహారం ఇచ్చిన కిరీటి ఒక్కో కుటుంబం నుండి ఒక్కో వ్యక్తి అర్హతలకు తగిన ఉద్యోగం ఇస్తానని కూడా హామీ ఇచ్చాడు.

ఇకముందు ఏ కార్మికుడు మరణించినా అతడిపై ఆధారపడిన కుటుంబానికి ఫాక్టరీ తరుపున పది వేలరూపాయల ఫండ్ ఇవ్వబడేట్టుగా "డేత్ రిలీఫ్ ఫండ్" అనే పథకాన్ని కూడా ప్రవేశపెట్టాడు.

కిరీటి తీసుకున్న నిర్ణయాలు కార్మికుల్లో పెద్ద సంచలనాన్ని రేపాయి. అందరికీ ఆయన పూజ్యునీయుడయ్యాడు.

“ఈ కర్మాగారం నాది..... దీని పురోభివృద్ధికి నేనూ బాధ్యుడ్నే” అని ప్రతి కార్మికుడు తలంచడంతో నీరాపేక్షణీయంగా ఉత్పాదకశక్తి పెరిగింది.

ఎప్పటికప్పుడు ఉత్పత్తికి సంబంధించిన వ్యవహారాల్ను అతి జాగరూకుడై పరశీలించాల్సి రావటంతో కిరీటి ఎక్కువ కాలాన్ని ఫాక్టరీలోనే గడపాల్సి వచ్చేది...

ఒక్కోరోజు నానీ నిద్రలేవకుండానే ఆఫీసుకి వెళ్ళిపోతూ వుండేవాడు.

అలాంటి సమయాల్లో ఒక్కోమారు నానీతో ఫోన్‌లో కొంతసేపు కాలక్షేపం చేయటం అలవాటు చేసుకున్నాడు.

కొత్తగా ప్రారంభించిన రిసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెక్షను విజిట్ చేసి తిరిగొచ్చి అలసటగా రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చున్న కిరీటి “ఫోసెకో హేండ్‌బుక్”ను అందుకుని తిరగేయసాగాడు.

మనసులో శిల్పతో మాట్లాడాలని వున్నా బలవంతంగా కోరికను అణచుకున్నాడు.

ఫోన్ రింగవుతుంది...

శిల్ప అయితే బాగుణ్ను అన్న ఆలోచనతో రిసీవర్ని అందుకున్నాడు.

నానీ....

“యస్ నానీ .... హౌఆర్యు?”

“ఫైన్ అంకుల్...”

“ఏమిటి విశేషం....”యధాలాపంగా అడిగాడు.

“ఇవాళ మీరు నాతో చెప్పకుండానే ఆఫీసుకి వెళ్ళారు. ఇవాళ మాత్రమే కాదు... చాలాసార్లు....”

“సారీ నానీ... నువ్వప్పటికింకా నిద్రలేవలేదు....”

“ఏమో... నాకు ఆంటీయే మంచిది....”

“సారీ చెప్పానుగా ...”

“అంకుల్..... ఇవాళేమో మార్నింగ్ నన్ను ఆంటీ షాపింగ్ తీసుకెళ్ళింది మంచి మంచి టోయ్స్, రడీమేడ్ డ్రెసెస్ కొంది.”

“ఈజిట్....”

“రియల్లీ అంకుల్ ! ఇప్పుడేగా మేము వచ్చింది.”

అవును..ఈ మధ్య కాస్త బిజీగా వుండటంతో నానీని షాపింగ్‌కు తీసుకెళ్ళటమే మర్చిపోయాడు. నిజానికి శిల్ప చేరదీసి వుండకపోతే నానీ ఇక్కడ కూడా ఒంటరితనంతో దిగులుపడేవాడే.

“నానీ.. మరి ఆంటీతో భోంచేశావా?”

“ఉహు ఆంటీ యీజ్ డేమ్‌టైర్డ్ యునో... ఓ పది నిమిషాలు పోయాక లంచ్‌చేద్దామని చెప్పింది.”

“అయితే ఆంటీ ఇప్పుడేం చేస్తుంది.”

“రెస్టు తీసుకుంటుంది.”

“నీకు దగ్గరలో లేదుగా ...”

“ఉహు ఎందుకు ? పిలవమంటావా అంకుల్...?”

“అబ్బే...వద్దు” తత్తరపడిపోయాడు కిరీటి .

మనసులో చిలిపి కోరిక.

“నానీ.... జగదాంబాలో “సౌండాఫ్ మ్యూజిక్” ఆడుతోంది... ఫస్ట్‌షోకి వెళదామా?”

“అలాగే అంకుల్!”

“మరి మీ ఆంటీ కూడా వస్తుందా?”

“అడిగి చెప్పేదా?”

“నో నో... అదికాదు” అంటూ వారించి కొంతసేపు నిశ్శబ్దంగా వుండిపోయిన కిరీటి “నానీ -- ఓ పని చేస్తావా” అని నెమ్మదిగా అన్నాడు. తన ఆలోచనకు రూపం ఇచ్చే ప్రయత్నంగా .

“ఏంటి అంకుల్ ”

“మీ ఆంటీకి నువ్వంటే ఇష్టమేగా?”

“చాలా ఇష్టం”

“అయితే ఆంటీని నువ్వే ఒప్పించు... పిక్చరుకి వెళదామని.”

“అదేంటి అంకుల్ ! మీరు చెప్పినా వస్తుందిగా?”

ఇరకాటంలో పడిపోయాడు కిరీటి.

తమ మధ్య వున్న దూరాన్ని నాని వూహించటం అతనికి ఇష్టంలేదు.

“అదికాదు నానీ... మార్నింగ్ ఆంటీక్కూడా చెప్పకుండా వచ్చేశాగా అందుకని ఆంటీకి నామీదచాలా కోపంగా వుంది.”

ఓ చిన్న అబద్దం ఆడేశాడు.

“అలాగా అంకుల్! అయితే నేను ఒప్పిస్తాను. మరి మీరు ఎర్లీగా వచ్చేస్తారుగా?”

“షూర్! కాని నేనే అడగమన్నట్టుగా మాత్రం తెలియనివ్వకు”నానీ ఫోన్ పెట్టేశాడు.

“ఆంటీ!”

నానీ పిలుపుతో కళ్ళు తెరిసింది పరుపుపై సాగిలబడిన శిల్ప.

“ఏమిటి?”

నానీలోని ఉత్సాహానికి కారణమేమిటాని పరీక్షగా చూసింది.

"మరేమో "సౌండాఫ్ మ్యూజిక్" పిక్చరుకి వెళదామా?"

సినిమా పేరు కూడా అంత స్పష్టంగా చెప్పడంతో ఇది ఎవరి ప్రోద్భలమో ఆమె ఊహించగలిగింది.

"నీకా సినిమా అంటే అంత ఇష్టమా!"

"అవును ఆంటీ!"

"మరి మీ అంకుల్ అడగలేక పోయావా?"

"అసలు అంకులే నన్నడిగారు ఆంటీ!"

"అలాగా"

"నిన్ను ఒప్పించమని కూడా చెప్పారు"

"నిజంగా!"

"ఊ....."

"ఇంకా ఏమన్నారు"

"అంకుల్మీద నీకు కోపమటగా?"

"ఎందుకట?"

"చెప్పకుండా వెళ్ళిపోయారని...."

"మరేం..."

"అందుకని నిన్ను ఒప్పించమని చెప్పి...."

"అలా చెప్పానని నాకు చెప్పొద్దన్నారు... అవునా?"

"అవును ఆంటీ ..."

అమాయకంగా మొహం పెట్టిన నానీని చూస్తే నవ్వాగింది కాదు.

"పిచ్చి నానీ ...మరి నాకు చెప్పేశావుగా..."

"తప్పయిపోయింది ఆంటీ...ఆంటీ... నేను చెప్పేశానని అంకుల్కి చెప్పనని ప్రామిస్ చేయవూ..."

"ప్రామిస్..."

"మా ఆంటీ చాలా మంచిది."

అనందంగా ఆమెను హత్తుకుపోయాడు.

సాయంకాలం కిరీటి వచ్చేసరికి నానీ, శిల్ప తయారై ఉండటంతో తన పథకం జయ ప్రదమైనందుకు సంతోషపడ్డాడు కిరీటి .

థియేటరులో శిల్ప తన ప్రక్కనే కూర్చుంటుందని వూహించిన కిరీటికి నిరాశే ఎదురైంది.

ఇద్దరి మధ్యగా నాని కూర్చున్నాడు.... కాదు శిల్పే కూర్చునేట్టు చేసింది.

మధ్యలో ఒకటి అరా చూపులు కలవటం తప్ప పెద్దగా థ్రిల్ లేకపోవటంతో సినిమా

నానీ నిద్రపోవటంతో కారులో కూడా ఇద్దరూ మాట్లాడుకోలేదు.

తిరిగొచ్చాక నానీని బలవంతంగా నిద్రలేపి భోజనం తినిపించి గదిలోకి తీసుకు వెళ్ళి పోయింది.

"ఇవాల్టికి నానీని నాదగ్గరే పడుకోనివ్వరాదూ?"

తన గది ద్వారం దగ్గర నిలబడ్డ కిరీటిని చూసి ఉలిక్కి పడినట్టుగా బెడ్‌పై నుండి లేసింది.